క్లుప్తంగా

ఎస్ఏ-2 పరీక్షల పరిశీలన


బాలికోన్నత పాఠశాలలో పరీక్షలను పరిశీలిస్తున్న డీఈఓ మాణిక్యం నాయుడు

గజపతినగరం: మండల కేంద్రంలోని బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో ఎస్ఏ-2 పరీక్షల నిర్వహణ తీరును డీఈఓ యు.మాణిక్యంనాయుడు గురువారం పరిశీలించారు. పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ విమలమ్మ,బాలుర, బాలికోన్నత పాఠశాలల హెచ్ఎంలు ఎం.వెంకటేశ్వరరావు, చిప్పాడ రమేష్ కుమార్ ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ తులసీనాథ్

బొండపల్లి: అంబటివలస గ్రామంలోని ఎర్ర చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ కె.తులసీనాథ్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా వేతనదారులతో ఆయన మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేత నం అందుతుందని చెప్పారు. ఆయన వెంట స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

ఏరియా ఆస్పత్రిలో తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ పద్మశ్రీవాణి

గజపతినగరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో డీసీహెచ్ఎస్ (జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి) ఎస్.పి.పద్మశ్రీవాణి గురువారం తనిఖీలు చేశారు. ఆస్పత్రిలో వార్డులు, ల్యాబ్‌లు, మౌలిక సదుపాయాలు, వైద్యపరికరాల పని తీరు, మందుల నిల్వలు, ఓపీ, ఐపీ, ప్రసవాలు, శస్త్ర చికిత్సలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే రోగులతో మాట్లాడి వైద్యసేవలు, భోజనం సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఆమె వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీష్, పలువురు వైద్యాధికారులు ఉన్నారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు


విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ హేమలత

గంట్యాడ: నరవ గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు గంట్యాడ పీహెచ్ సీ వైద్యాధికారి హేమలత గురువారం వివిధ పరీక్షలు చేశారు.అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం విద్యార్థినులకు ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టిసారించగలరని చెప్పారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

కిరణ్‌పై ఫిర్యాదు


ఎస్ఐ నారాయణరావుకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులు

గుర్ల: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన భార్య భారతిపై అనుచిత వ్యాఖ్య లు చేసిన ఐటీడీపీ సభ్యుడు చేబ్రోలు కిరణ్‌పై కేసు నమోదు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం నాయకులు గుర్ల ఎస్ఐ పిసిని నారాయణరావు కు గురువారం ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ కెల్ల సురేష్, చీపురుప ల్లి నియోజకవర్గ సోషల్ మీడియా కో-కన్వీనర్ శేషపు ప్రకాష్, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు మంత్రి పైడినాయుడు, గుర్ల మండల సోషల్ మీడియా కో-కన్వీనర్లు మీసాల సంతోష్, బూడి దుర్గాప్రసాద్, కెల్ల పైడిరాజు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గరివిడి మండలంలోని కోనూరు పీహెచ్‌సీలో పలువురు టీబీ(క్షయ) బాధితులకు గురువారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. వైద్యాధికారులు రమణి, విష్ణుబాలాజీ మాట్లాడుతూ టీబీ వ్యాధి బారినపడిన వారు భయపడాల్సిన పని లేదన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే మందులను వాడుతూ విధిగా పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నయమవుతుందని చెప్పారు. టీబీ సూపర్‌వైజర్ లలిత, ఎంపీహెచ్ఈఓ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతన వేదన

- మూడు నెలలుగా అందని వేతనాలు
- గతంలో ఎప్పుడూ ఇలా జాప్యం జరగలేదంటున్న వేతనదారులు
- గునపాలు,తట్టలు,వేసవి అలవెన్సులకు ఎగనామం


గత నెలలో కెరటాం గ్రామంలో ఫారం పాండ్ పనులను ప్రారంభించిన కలెక్టర్ అంబేడ్కర్ (ఫైల్)

బొండపల్లి: గ్రామాల్లో వలసల నివారణ కోసం 2005లో కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చి, చట్టం చేసింది. ఉన్న ఊళ్లలోనే ఒక్కో కుటుంబానికి ఏడాదికి 100 రోజులు పని కల్పించడంతో పాటు పని చేసిన రోజు నుంచి వేతనదారులకు(కూలీలు) 15 రోజుల్లోగా వేతనాలు అందించాలని ఉపాధి హామీ చట్టంలో పేర్కొన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ఉసురు తీస్తోంది. ప్రభుత్వ నిర్వాహకంతో వేతనదారులు ఆకలి కేకలు పెడుతున్నారు. పనులు చేసి నెలలు గడుస్తున్నా తమకు వేతనాలు అందలేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికా రంలోకి వచ్చిన తర్వాత 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జనవరి నెల నుంచి 2025-2026 ఆర్థిక సంవత్సరం ప్రారంభం వరకు మండలంలో 80 రోజులు ఉపాధి పనులు చేశారు. అలాగే అలాగే 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పది రోజులు పని చేశారు. గత ఆర్థిక సంవత్సరంతో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేతనాలను ప్రభుత్వం నేటికీ చెల్లించ లేదు.

వేలాది మంది ఎదురు చూపులు

బొండపల్లి మండలంలో జనవరి నెల నుంచి మార్చి నెలాఖరు వరకు 7 వేల మంది ఉపాధి పనులకు హాజరయ్యారు. వీరికి ప్రభుత్వం రూ.2.89 కోట్లు చెల్లించాల్సి ఉంది. వీరంతా వేతనాల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఇదే పరిస్థితి జిల్లాలోని అన్ని మండలాల్లో ఉంది. మూడునెలలుగా వేతనాలు ఇవ్వకపోతే తాము కుటుంబాలను ఎలా నెట్టుకురాగలమని, ఎప్పుడు ఇస్తారో చెప్పాలని వేతనదారులు ప్రశ్నిస్తు న్నారు. పని చేసి 15 రోజులు దాటిన తర్వాత వేతనాలు చెల్లించకుంటే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఉపాధి హామీ చట్టంలో నిబంధన ఉన్నప్పటికీ ప్రభుత్వం అవేమీ పట్టించుకోవడం లేదు. గతంలో మార్చి నెల నుంచి జూన్ వరకు వేసవి అలవెన్సుతో పాటు తాగునీరు కోసం ప్రత్యేకంగా కొంత డబ్బులను వేతనాలతో పాటు కూలీల ఖాతాలో జమచేసే వారు. అలాగే తట్టలు,గునపాల కోసం ప్రత్యేకంగా డబ్బులు చెల్లించే వారు. ఇప్పుడు వాటిన్నంటికీ కూటమి ప్రభుత్వం మంగళం పాడింది.

నెలల తరబడి ఇవ్వకపోతే ఏలా



పనులు చేసి నెలలు గడిచిపోతున్నా వేతనాలు జమ చేయలేదు. పనిచేయడమే తప్ప ప్రభుత్వం ఎప్పుడు వేతనాలు జమ చేస్తుందో తెలియడం లేదు. గతంలో ఇలాంటి పరిస్థితులు లేవు. పనిచేసిన 15 రోజుల్లోగా వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమయ్యేవి. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే కుటుంబ పోషణ ఎలా..?. అధికారులు స్పందించి వేతనబకాయిలు చెల్లించాలి. **– కొత్తల దుర్గమ్మ, ఉపాధి వేతనదారు, గొట్లాం, బొండపల్లి మండలం**

ఇబ్బందులు పడుతున్నాం



ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. పనులు చేసి 80 రోజులు అవుతున్నా ఇంకా వేతనాలు అందలేదు.వేరే కూలి పనులు లేక ఉపాధి పనులకు వెళుతున్నాం. నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే కుటుంబాన్ని ఎలా నెట్టుకురాగలం.ప్రభుత్వం తక్షణమే వేతనాలు విడుదల చేయాలి. **– బోడసింగి జ్యోతి, ఉపాధి వేతనదారు, బోడసింగిపేట, బొండపల్లి మండలం**

• ఉద్యోగ భద్రత కల్పించాలి



తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మెరకముడిదాం మండలంలోని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈమేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ విశ్వనాథంకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏ తప్పు చేయకపోయినా పలు గ్రామాల్లో రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తున్నారని, ఇలాంటి చర్యలను వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. అలాగే తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలని, అర్హత ఉన్న వారికి ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. ఎన్ఎంఎంఎస్ యాప్, ఫ్యాన్‌డేస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

– మెరకముడిదాం

• బడిబాటను విజయవంతం చేద్దాం..



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు, బడిమానేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించడమే లక్ష్యంగా నిర్వహించనున్న 'బడిబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మెరకముడిదాం ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. మెరకముడిదాం ఎమ్మార్సీలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను ఉపాధ్యాయులు అంతా తల్లిదండ్రులకు వివరించి, పిల్లలను సర్కారు బడిలో చేర్పేలా చూడాలన్నారు. అనంతరం బడిబాట కరపత్రాలను విడుదల చేశారు.ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆల్తి రాంబాబు, టి.వి.ఎల్.నరసింహం, అప్పలరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పాల్గొన్నారు.

–మెరకముడిదాం

ఎమ్మెల్సీ 'గాదె'కు సన్మానం


ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడును సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడును మండల పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు స్థానిక ప్రైవేట్ రిసార్ట్స్‌లో గురువారం సన్మానించారు. ఈసందర్భంగా శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నానని, గతంలో పలు దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని వివరించా రు. తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్సీగా గెలిపించిన ఉపాధ్యాయ లోకానికి రుణపడి ఉంటానని చెప్పారు. పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు, జిల్లా అధ్యక్షులు వలిరెడ్డి రవీంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.అశోక్‌రాజు, కార్యవర్గ సభ్యులు కె.మోహన్‌రాజ్, ఉత్తరాంధ్ర రీజియన్ నాయ కులు బి.శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి వెంకట చలంనాయుడు


నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు పెంటంనాయుడు

బొండపల్లి: గజపతినగరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడిగా నియమి తులైన జె.గుమడాం గ్రామ మాజీ సర్పంచ్ సాలాపు పెంటంనాయుడు, పార్టీ జిల్లా కార్యవర్గ కార్యదర్శిగా నియమితులైన గొల్లుపాలెం గ్రామానికి చెందిన మూకల వెంకట చలం నాయుడు తెలిపారు. పార్టీ అధిష్టానం జారీ చేసిన నియామక ఉత్వర్వులను వారికి మండల కేంద్రంలో ఎంపీపీ చల్లా చలం నాయుడు, పార్టీ మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు గురువారం అందజేశారు. వీరికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోండి


ఆర్డీఓ రామ్మోహన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

దత్తిరాజేరు: రైల్వే మూడో లైన్ నిర్మాణం కోసం ఇళ్లు కోల్పోయిన తమకు వేరొక చోట ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని మండలంలోని పెదమానాపురం గ్రామ నిర్వాసితులు బొబ్బిలిలో ఆర్డీఓ రామ్మోహన్ రావును కోరారు. నిర్వాసితులు గురువారం బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా నిర్వాసితులు చిల్ల గోవింద్, జి.రామసత్యం, తదితరులు మాట్లాడుతూ అధికారుల మాటలు నమ్మి రైల్వే మూడో లైన్ నిర్మాణం కోసం 30 కుటుంబాలు వారమంతా ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. వంద రోజుల్లోగా మాకు వేరే చోట ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆ సమయంలోనే అధికా రులు మాట ఇచ్చారని గుర్తు చేశారు.మాట ఇచ్చి మూడు నెలలవుతోందని, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని ఆర్డీఓను కోరారు.

సక్రమంగా విధులు నిర్వర్తించాలి


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న పీడీ రుక్సానా సుల్తానా బేగం

గంట్యాడ: అంగన్‌వాడీ సిబ్బంది సమయానికి కేంద్రాలను తెరుస్తూ, సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం సూచించారు. కొర్లాం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేంద్రంలోని చిన్నారులతో ఆమె ముచ్చటించారు. కేంద్రంలో పౌష్టికాహార స్టాక్, రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్త గృహ సందర్శన చేస్తున్నారా లేదా, ఆరోగ్య జాగ్రత్తలను వివరిస్తు న్నారా లేదా అని ఆరా తీశారు. గర్భం దాల్చిన నుంచి ప్రసవం తర్వాత బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. పౌష్టికాహార లోపం పెద్ద సమస్య అని, అటువంటి సమస్యతో బాధపడుతున్న వారిని గుర్తించి ప్రత్యేకంగా పౌష్టికాహారం అందించనున్నామని తెలిపారు. అలాగే పిల్లల్లో ఊబకాయ సమస్యను తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవన శైలి పాటించాలని అవగాహన కల్పించారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ ఉన్నారు.

ఎన్ఎంయూ గేటు ధర్నా


ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ కార్మికులు, నాయకులు

శృంగవరపుకోట: రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మధ్యాహ్నం భోజన విరామసమయంలో ఎన్ఎంయూ కార్మికులు స్థానిక ఆర్టీసీ డిపో వద్ద గేటు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎన్ఎంయూ స్టేట్ చీఫ్ సెక్రటరీ జి.ఎస్.రాజు, జిల్లా కార్యదర్శి పి.జి.రాఫెల్, జిల్లా కమిటీ సభ్యులు కె.ఆనంద్ మాట్లాడుతూ 2019 జనవరి నాటి సర్క్యులర్ అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ ఆపాలని, నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. అలాగే నాన్ ఆపరేషన్ ఉద్యోగుల సమస్యలు తీర్చాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానం అమలు చేయాలని, 114 జీఓ ప్రకారం నైట్ అలవెన్స్‌లు ఇవ్వాలని, ఓడీలు కేటాయించి, డిప్యూటేషన్లు యథాతథంగా కొనసాగించాలని, విశ్రాంత ఉద్యోగులను సూపర్ లగ్జరీబస్‌లకు అనుమతించాలని, ఆన్‌కాల్ డ్రైవర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నిరసన


ముసుగు తొలగించాలంటూ విశ్వ హిందూపరిషత్ కార్యకర్తల నిరసన

చీపురుపల్లిరూరల్(గరివిడి): అన్యమత ప్రచారం వద్దంటూ గరివిడి మండలంలోని కాపుశంబాం గ్రామంలో రెండు రోజుల కిందట స్థానికులు బోర్డు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు బోర్డుకు ముసుగు వేశారు. దీనిపై విశ్వ హిందూపరిషత్ కార్యకర్తలు గురువారం నిరసనకు దిగారు. అధికారులు వచ్చి ముసుగు తొలగించాలని ధర్నా చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, ఎంపీడీఓ ఎంబీవీ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ బి.లోకేశ్వరరావు, ఆర్ఐ అచ్యుతరావు గ్రామానికి వెళ్లి సమస్యను సద్దుమణిగించే ప్రయత్నం చేశారు. అధికారుల ఎదుటే విశ్వహిందూపరిషత్ కార్యకర్తలు, స్థానికులు బోర్డుకు వేసిన ముసుగును తొలగించారు.

ఆర్ఓబీ నిర్మాణ డిజైన్ మార్చండి


విజయనగరం ఆర్డీఓకు సమస్యను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, కొండలక్ష్మీపురం గ్రామస్తులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): తమ గ్రామానికి ఆనుకుని ఉన్న రైల్వే ట్రాక్‌పై చేపట్టనున్న ఆర్ఓబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జ్)నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌లో మార్పు చేయాలని గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురం గ్రామస్తులు అధికారులను కోరారు.కొండలక్ష్మీపురం సమీపంలో ఆర్ఓబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రైల్వే ఇంజినీరింగ్ అధికారులు డిజైన్ సిద్ధం చేశారు. ఈ డిజైన్‌పై తమ అభ్యంతరాలు జాయింట్ కలెక్టర్‌కు చెప్పుకుందామని కొండలక్ష్మీపురం గ్రామస్తులు, మండల ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం కలెక్టరేట్‌కు వెళ్లారు. అయితే జాయింట్ కలెక్టర్ లేకపోవడంతో విజయనగరం ఆర్డీఓ కీర్తికి వినతిపత్రం అందజేశారు. అలాగే చీపురుపల్లి ఆర్డీఓ సత్యవాణిని కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే ఇంజినీరింగ్ అధికారులు ఇచ్చిన డిజైన్‌తో తమ గ్రామంలో 50 ఇళ్లు కోల్పోతున్నామని, దేవాలయాలు, నేలబావులు, బోరువెల్స్ ఇలా చాలా వరకు నష్టపోతామని చెప్పారు. డిజైన్‌లో మార్పు చేసి తమ గ్రామానికి నష్టం వాటిల్లకుండా చూడాలని కోరారు.గరివిడి తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు, కొండలక్ష్మీపురం సర్పంచ్ పాండ్రంకి కామేశ్వరరావు, మండల ప్రజాప్రతినిధులు మీసాల విశ్వేశ్వరరావు, పైల బలరాం, సారిపాక సురేష్, మీసాల ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

సారాతో పట్టుబడిన వ్యక్తికి రిమాండ్

కొత్తవలస: మండలంలోని తమ్మన్నమెరక గ్రామంలో రెండు లీటర్ల నాటుసారాతో పట్టుబడిన ఎస్.దేముడుకు కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారని ఎక్సైజ్ ఎస్ఐ వి.ఎన్.రాజు తెలిపారు. తమ్మన్నమెరక గ్రామంలో సారా తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు గురువారం దాడులు చేశామని ఎక్సైజ్ ఎస్ఐ చెప్పా రు. గ్రామానికి చెందిన దేముడు వద్ద రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పరిచామని పేర్కొన్నారు. నిందితుడికి కోర్టు రిమాండ్ విధించడంతో ఎస్.కోట సబ్‌జైలుకు తరలించామని చెప్పారు.

అనుమతులు లేకుండా అడ్మిషన్లు


చీపురుపల్లిరూరల్(గరివిడి): అనుమతులు లేకుండా, భవన నిర్మాణాలు పూర్తికాకుండానే గరివిడిలో శ్రీ చైతన్య కార్పొరేట్ స్కూల్ అడ్మిషన్లు కల్పిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రతినిధులు ఎం.వెంకీ, ఈ.వంశీ, సీహెచ్.రమణ ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ బృందం గురువారం ఆ పాఠశాల భవన నిర్మాణాలను పరిశీలించారు. భవన నిర్మాణాలు పూర్తికాకుండా, అడ్మిషన్లు ఎలా ప్రారంభిస్తారని ఎస్ఎఫ్ఐ నాయకులు స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, తమకు ఎలాంటి సమాచారం లేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు చెప్పారు.

ఇళ్ల స్థలాలివ్వాలని ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పలుగ్రామాల ప్రజలు

కొత్తవలస: తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. సీపీఐ నాయకుడు దేగల అప్పలరాజు మాట్లాడుతూ 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మండలంలోని పలువురికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, స్థలాలు చూపించలేదని గుర్తు చేశారు. 2019 ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం పేదలను ఇళ్ల స్థలాల పేరుతో మోసం చేసిందని ఆరోపించారు. ఇప్పుడు టీడీపీనే అధికారంలో ఉందని, ఇప్పటికైనా నాడు పట్టాలు అందించిన వారికి స్థలాలు చూపాలని డిమాండ్ చేశారు. అలాగే పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నప్పటికీ ఎన్నికల హామీల్లో 10 శాతం కూడా అమలు చేయకపోవ డం దారుణమన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

• పౌష్టికాహారంతో ఆరోగ్యం


దత్తిరాజేరు: పెదకాద అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ శకుంతల


వేపాడ: బొద్దాంలో అవగాహన కల్పిస్తున్న ఏపీడీపీ లక్ష్మీబాయి, తదితరులు


కొత్తవలస : బలిఘట్టాంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సిబ్బంది అన్నారు. పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా దత్తిరాజేరు మండలంలోని పెదకాద అంగన్‌వాడీ కేంద్రం, వేపాడ మండలంలోని బొద్దాం అంగన్‌వాడీ కేంద్రం-2, కొత్తవలస మండలంలోని బలిఘట్టాం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు గురువారం అవగాహన కల్పించారు. పిల్లల వెయ్యి రోజుల సంరక్షణతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. అలాగే కౌమార బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్యజాగ్రత్తలను వివరించారు.

– దత్తిరాజేరు/వేపాడ/కొత్తవలస